# బయో డేంజర్ బెల్స్

## గ్రేటర్‌లో ప్రమాదకరంగా బయో వ్యర్థాల డంపింగ్

**మున్సిపల్ వ్యర్థాల్లోనే పారబోత**
**కుప్పలుతెప్పలుగా మెడికల్ వ్యర్థాలు**
**రోగాలబారిన చెత్త సేకరణదారులు**
**నిద్రమత్తులో కాలుష్య నియంత్రణ మండలి**



నార్సింగిలోని డొమెస్టిక్ డంపింగ్ యార్డు

సిటీ బ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డుల్లో బయో మెడికల్ వ్యర్థాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. నగరం నలుమూలలా ఏ డొమెస్టిక్ డంపింగ్ యార్డులో చూసినా దవాఖానల నుంచి తీసుకువచ్చిన మెడికల్, కెమికల్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దవాఖానల నుంచి వ్యర్థాలను సేకరించడానికి ప్రత్యేకంగా రూపొందించిన వందకు పైగా వాహనాలున్నా నిర్వాహకులు మున్సిపల్ వ్యర్థాలను తరలించే వాహనాల్లోనే వాటిని పడేస్తున్నారు. చెత్త సేకరణ చేసేవాళ్లు వాటిని తీసుకొచ్చి గృహ వ్యర్థాలతో కలిపి డంపింగ్ యార్డుల్లో పారబోస్తున్నారు. అయితే డంపింగ్ యార్డు నిర్వాహకులు సైతం వాటిని వేరు చేయకపోవడంతో గృహ వ్యర్థాలతోనే అవి కలిసిపోతున్నాయి. నార్సింగి, మణికొండ, నానక్‌రామ్‌గూడ డంపింగ్ యార్డుల్లో బయో మెడికల్ వ్యర్థాల కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. వాటిలో సూదులు, సిరంజిలు, గాయాలకు డ్రెస్సింగ్ చేసిన దూది, సెలైన్ బాటిళ్లు, మూత్రపు పైపులు, మాస్కులు, చేతి గ్లౌజులు ఉన్నాయి. సిబ్బంది చేతులతోనే తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పర్యావరణానికి ముప్పు...**

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయంగా చేపట్టాల్సి ఉంటుంది. వాటిని బహిరంగ ప్రదేశాల్లో, గృహ వ్యర్థాలతో కలిపి పారబోయడం అత్యంత ప్రమాదకరం. దవాఖానల్లో వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం ద్వారా బయో వ్యర్థాలు భారీగా పోగుపడుతాయి. వీటిలో సూదులు, సిరంజీలు, దూది, మాస్కులు, చేతి గ్లౌజులు, రక్త పరీక్ష పరికరాలు, సెలైన్ బాటిళ్లు, వైర్లు, పీపీఈ కిట్లు, శానిటరీ నాప్‌కిన్‌లు ఉంటాయి. వీటిని జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2016 ప్రకారం సురక్షితంగా, శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉంటుంది. కానీ దవాఖాన యాజమాన్యాలు నిర్లక్ష్యంతో ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నాయి. ఇలా బయో మెడికల్ వ్యర్థాల్లో ఉండిపోయిన కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరస్, రోగ కారకాలు.. వ్యర్థాలను తొలగించే సిబ్బందికి సంక్రమించే ప్రమాదం ఉంటుంది. అలాగే వీటిని తొలగించే క్రమంలో సూదులు, ఫోర్‌స్లిప్‌లు గుచ్చుకుని పారిశుధ్య కార్మికులు ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతున్నారు. అదేవిధంగా వాటిలోని రసాయనాలు, బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల గాలి, నీరు, నేల కలుషితమవుతున్నాయి. వాటిని తొలగించే క్రమంలో సిబ్బందికి హెపటైటిస్, హెచ్‌ఐవీ, టీబీ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

**తనిఖీలు చేపట్టాలి**

బయో వ్యర్థాలను దవాఖానల నుంచి సేకరించే వాహనాలు గ్రేటర్ వ్యాప్తంగా వందకు పైగా ఉన్నాయి. వీటిలో వివిధ రకాల వ్యర్థాలను స్టెరిలైజ్ చేసేందుకు ఏర్పాట్లు ఉంటాయి. ఆయా వాహనాలు జీపీఎస్ ట్రాకర్‌తో అనుసంధానమై ఉంటాయి. వీటిని నిర్వహించే ఏజెన్సీ వాళ్లు కాలుష్య నియంత్రణ మండలిలో వాహనాల రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. ఇవి నిరంతరం అన్ని దవాఖానల్లో చెత్తను సేకరిస్తుంటాయి. ఇందుకు దవాఖానలు నిర్వహణ ఖర్చు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ డబ్బు ఇవ్వకుండా తప్పించుకునేందుకు దవాఖానలు బయో వ్యర్థాలను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లో వేస్తున్నారు. దీంతో అవన్నీ డంపింగ్ యార్డులకు చేరి పర్యావరణంతో పాటు చెత్త సేకరణ సిబ్బందికి హాని కలిగిస్తున్నాయి. ఇలాంటి బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. దవాఖానలు, గృహ వ్యర్థాల డంపింగ్ యార్డుల్లో ర్యాండమ్ తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అలాంటి తనిఖీలు ఎంతమాత్రమూ జరగడం లేదని విమర్శలున్నాయి. దీంతో పర్యావరణ కాలుష్యంతో పాటు ఇటు పారిశుధ్య సిబ్బందికి రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరంతర తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గృహ వ్యర్థాలతో కలిసిపోయిన బయో మెడికల్ వ్యర్థాలు

# డా.రఘురాం సేవలు అభినందనీయం



రఘురామ్‌కు వచ్చిన గిన్నిస్ రికార్డులను ప్రదర్శిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సిటీబ్యూరో, జూన్22 (నమస్తే తెలంగాణ): మూడు నెలల క్రితం మౌంట్ అబూలోని బ్రహ్మ కుమారీస్ ప్రపంచ ప్రధాన కేంద్రంలో అత్యధిక సంఖ్యలో రొమ్ము క్యాన్సర్ అవగాహన తరగతులు నిర్వహించి డా.రఘురాం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'రొమ్ము క్యాన్సర్ ఏబీసీఎస్– ప్రతి మహిళ తెలుసుకోవలసిన విషయాలు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా అక్టోబర్ నెలలో తెలంగాణ రాజ్‌భవన్‌ను గులాబీ రంగులో వెలుగులు వెలిగించి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డా.రఘురాం సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. కిమ్స్–ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజ్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ డా. రఘురాం మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి దేశంలో ప్రతి సంవత్సరం 2 లక్షల కొత్త కేసులు, లక్ష మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు. క్యాన్సర్‌ను జయించిన బ్రహ్మ కుమారీస్ హైదరాబాద్ కేంద్రాధిపతి బీకే కుల్దీప్ దీదీ తన అనుభవాన్ని పంచుకుంటూ.. నా రొమ్ము క్యాన్సర్ ప్రయాణంలో డా. రఘురాం ఇచ్చిన చికిత్స, శ్రద్ధ, సానుభూతితో నాకు ధైర్యం కలిగిందన్నారు. ఆయన నుంచి అందుకున్న ప్రేరణ వల్లనే నేను ధైర్యంగా ముందుకెళ్లగలిగానని తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



చందనవెల్లిలో బీసీ సేన నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్న జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్ చారి

షాబాద్, జూన్ 22 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లిలో బీసీ సేన ఉపాధ్యక్షుడు మేకల బాలరాజ్ ఆధ్వర్యంలో బీసీ సేన గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చాకలి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా గడీల మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేశ్, యువజన కమిటీ అధ్యక్షుడిగా చిప్పలపల్లి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా గుడాల శివను ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ... బీసీలు సామాజికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే గ్రామస్థాయి నుంచే ఏకం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ జనాభాలో 60–70 శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని తెలిపారు. బీసీలకు అండగా జాతీయ నేత ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో తాము గ్రామస్థాయి నుంచి బీసీలను బలోపేతం చేస్తున్నామన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సేన ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్ చారి,జిల్లా నాయకులు మేకల వెంకటేశ్, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, కార్యదర్శి చంద్రశేఖర్, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, షాబాద్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, విద్యావేత్త చేవెళ్ల స్వామి, మాజీ సర్పంచులు బోకుల లింగం, శ్రీనివాస్ గౌడ్, బీసీ సేన నాయకులు రాఘవాచారి, పి.మల్లేశ్, వెంకటేశ్, వడ్ల మల్లేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంతాపూర్‌లో నీటి ఎద్దడి



సంతాపూర్‌లో వ్యవసాయ పొలం నుంచి నీటిని తీసుకెళ్తున్న మహిళ

కేశంపేట, జూన్ 22 : మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని నీటి ట్యాంకుకు సరఫరా అయ్యే పైపు పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి నల్లాల ద్వారా నీరు రాకపోవడంతో సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. నీటి ఎద్దడి నివారణకు పంచాయతీకి చెందిన బోరు మోటరును కార్యదర్శి మరమ్మతు చేయించడంతో సమస్య కొంత మేర తీరిందన్నారు. ప్రతి ఇంటికీ పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కేజీబీవీలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల టౌన్, జూన్ 22 : స్థానిక మున్సిపల్ కేంద్రంలోని కేజీబీవీలో మహిళా అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, కెమిస్ట్రీలకు సంబంధిత పీజీ, బీఈడీ సబ్జెక్టుల్లో అర్హత ఉండాలన్నారు. ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) బోధించేందుకు ఎండీ పాథాలజీ మైక్రో బయాలజీ బయో కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ బయో కెమిస్ట్రీ, ఎంఎల్‌టీ బీ ఫార్మసీ, ఎమ్మెస్సీ జెనెటిక్స్, ఎంబీబీఎస్, ఎంహెచ్‌ఎంఎస్ పీజీడీ క్లినికల్ బయో కెమిస్ట్రీపై వాటిలో ఏదైనా అర్హత ఉన్న అభ్యర్థులు చేవెళ్లలోని కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే డే వాచ్‌మన్ మహిళా పోస్టు కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ : 9100439368 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



మాడుగుల నాగఫణి శర్మ ను సత్కరిస్తున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

ముషీరాబాద్, జూన్ 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై బ్రాహ్మణులు అవగాహన కలిగి ఉండాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణ ఐక్యవేదిక సదస్సులో పలువురు వక్తలు సూచించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించే బాధ్యత బ్రాహ్మణ సంఘాల నాయకులు తీసుకోవాలి అని వారు కోరారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆడిటర్ ధవళ మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయనీ, బ్రాహ్మణులు కేవలం వృత్తి పైనే ఆధారపడక వ్యాపార రంగంలో, వ్యవసాయ రంగంలో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోనీ ఆర్థికంగా బలపడాలని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డును అందుకున్న డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మను ప్రత్యేకంగా సన్మానించారు. మాడుగుల మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు వెళ్లినప్పుడే సమాజం హితం ఉంటుందని అన్నారు. సమాజం ఉన్నతమైనటువంటి స్థితికి చేరేందుకు బ్రాహ్మణులు తమ కర్తవ్యం నిర్వహించాలి అని చెప్పారు. బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏ వి ఆర్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ నాయకులు బసవరాజు శ్రీనివాస్, అన్నదానం సత్యనారాయణమూర్తి, బి సుధాకర్, మురుకుంట్ల రాజేశ్వరి శర్మ, డాక్టర్ వైజయంతి, పురాణపండ సురభి శర్మ, బ్రాహ్మణ ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు పోప్పూరి శ్రీనివాస్, ఏక శిరీష, బి శైలజ, తెన్నేటి సునీత మూర్తి, శ్రీరంగం కృష్ణమాచార్యులు, గుడిపాటి మారుతీ రామచంద్ర, సురేశ్ మోహనా చారి, సరళ, పద్మలత, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# మెట్రో సాధించే దాకా..

## ఉద్యమ కార్యాచరణకు సిద్ధం

**మేడ్చల్ మెట్రో సాధన సమితి నిర్ణయం**
**ఇప్పటికే కేంద్రానికి విస్తరణ ప్రతిపాదనలు**
**అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా..**
**కేంద్రంపై ఒత్తిడి పెంచేలా కార్యక్రమాలు**

సిటీబ్యూరో, జూన్ 22(నమస్తే తెలంగాణ): మేడ్చల్ మెట్రో సాధన కోసం స్థానికులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. రెండో దశ విస్తరణలో భాగంగా జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట మార్గంలో నిర్మించాల్సి ఉండగా, కేంద్రానికి డీపీఆర్ సమర్పించినట్లు మెట్రో సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో కేంద్రం వద్ద డీపీఆర్ అనుమతుల విషయంలో జాప్యం లేకుండా ఉండేందుకు తెలంగాణలో ఉన్న బీజేపీ నేతలను సంప్రదింపులు, చర్చలు, ప్లకార్డుల ప్రదర్శన వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి ఎంపికైన బీజేపీ ఎంపీలతో పాటు, పార్టీలకతీతంగా అన్ని పార్టీల నేతలను కలిసి తమ ప్రాంత ప్రయోజనాల కోసం పనిచేస్తామని మేడ్చల్ మెట్రో సాధన సమితి వెల్లడించింది. నిత్యం 30 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతానికి అధునాతన రవాణా సదుపాయాలే.. నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు.

### మూడు నెలల ఆలస్యం తర్వాత..

మూడు నెలల ఆలస్యం తర్వాత మెట్రో విస్తరణ ప్రతిపాదనలు కేంద్రానికి చేరాయి. ఇప్పటికీ రెండో దశ పార్ట్ ఏకు అనుమతులు రాలేవు. ఈ క్రమంలో పార్ట్ బీ విషయంలో ఏ మాత్రం జాప్యానికి తావు లేకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వ నేతలపై ఒత్తిడి పెంచాలని మెట్రో సాధన సమితి భావిస్తున్నది. నిర్ణీత కాలంలో ప్రాజెక్టు పనులు మొదలు కావాలంటే, అనివార్యంగానే ప్రజల మద్దతు కూడగట్టేలా కార్యాచరణ అవసరమని సాధన సమితి సభ్యులు పేర్కొంటున్నారు. తమ ప్రాంతానికి మెట్రో సాధన కోసం ఇన్నాళ్లు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, మెట్రో సంస్థతో సంప్రదింపులు చేసినట్లుగానే... ఇకపై ఢిల్లీ స్థాయిలో ప్రభావితం చేసేలా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ఎంపీలను కలిసి తమ ప్రాంతానికి మెట్రో ఆవశ్యకతను వివరిస్తామని పేర్కొంటున్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి




వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగుల సమాఖ్య నాయకులు

మొయినాబాద్, జూన్ 22 : దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక గ్రాంట్ కింద నిధులు కేటాయించాలని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్నిని వీరయ్య వర్మ కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను శనివారం ఆయన జిల్లా దివ్యాంగుల సమాఖ్య నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి బాధ్యతలు చేపడుతూ.. దివ్యాంగుల స్వయం సమృద్ధి సాధించే దిశగా 2,367 దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55 కోట్లు కేటాయించారని దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి తెలిపారు. దివ్యాంగులు వ్యక్తిగత స్వయం సమృద్ధి సాధించేలా 844 మందికి లబ్ధి చేకూరేలా రూ.5 కోట్లు కేటాయించారని తెలిపారు. అలాగే తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను సమాఖ్య నాయకులు కలిసి దివ్యాంగుల వికలత్వం నిర్ధారణ కోసం యూడీఐడీ సదరం క్యాంపును కొండాపూర్ ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకోసం జిల్లాలోని దివ్యాంగులు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని సమాఖ్య నాయకులు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి కొండాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావును కలిసి కొండాపూర్, షాద్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో సదరం క్యాంపును ఏర్పాటు యచేయాలని దివ్యాంగుల సమాఖ్య నాయకులు కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సమాఖ్య నాయకులు సురేశ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు ఎందుకులే..
# సెటిల్ చేసుకో..

## సిటీలో చాలా స్టేషన్లలో ఇదే పరిస్థితి..

**కొందరు పోలీసుల తీరుపై బాధితుల అసహనం**
**పెండింగ్ కేసులు పెరిగితే చీవాట్లే..**
**పై అధికారుల ఒత్తిడితో రాజీల వైపే మొగ్గు**



సిటీబ్యూరో, జూన్ 22(నమస్తే తెలంగాణ):

●కమాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన అఖిలేశ్ అనే వ్యక్తిపై శనివారం ఇద్దరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో అతని పళ్లు ఊడిపోవడమే కాకుండా ముఖంపై బాగా దెబ్బలు తగిలాయి. తనపై దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే బయటనే మాట్లాడుకోండి..ఈ పంచాయితీ ఇక్కడెందుకంటూ వారిని సముదాయించే యత్నం చేశారు పోలీసులు. ఫిర్యాదు తీసుకోకుండా బాధితులను స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

● మలక్‌పేటలో ఇటీవల ఓ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల ఓ వ్యక్తిని అందరూ చూస్తుండగా తీవ్రంగా కొట్టిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే సదరు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు మే నెల చివరి వారంలో రెండు సార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. తమపై దాడులు చేయాలని చూస్తున్నారని లెటర్ హెడ్‌పై ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి స్పందన లేదు. చివరికి జూన్ 12న దాడి జరిగిన తర్వాత సోషల్ మీడియాలో వీడియోలు వైరలైన ఒత్తిడి మేరకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశంతో బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

●హుస్సేని ఆలం పోలీస్‌స్టేషన్‌లో ఒక వ్యక్తి తనకు ఒకతనితో ప్రాణాపాయం ఉందంటూ పదిరోజుల కిందట ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోగా ఎదుటివారితో బయటనే మాట్లాడుకొని సెటిల్ చేసుకోమని చెప్పినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయమై ఎక్స్‌లో పోస్ట్ చేసినా వారి దగ్గర నుంచి ఎలాంటి స్పందన లేదని బాధితుడు పేర్కొన్నారు.

ఇలాంటి సంఘటనలు ప్రతిరోజూ హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో చాలా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని వచ్చే బాధితులకు ఎదురవుతున్నాయి. పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కి సమస్య చెప్పుకొంటే చాలు..పరిష్కరిస్తారు.. పరిష్కార మార్గం చూపిస్తారనే నమ్మకం ప్రజల్లో గతంలో ఉండేది. కానీ ప్రస్తుతం అదే పోలీసులు ప్రజల ఫిర్యాదులను పట్టించుకోకుండా తమకెందుకులే పంచాయితీ అంటూ బయటనే సెటిల్‌మెంట్ చేసుకోమని చెబుతున్నారు.

**సెటిల్‌మెంట్‌కే ప్రాధాన్యం..!**

కమిషనరేట్ పరిధిలో పాతబస్తీతో పాటు ఉస్మానియా పోలీస్‌స్టేషన్, మలక్‌పేట, లంగర్‌హౌస్, బేగంపేట, జూబ్లీహిల్స్, బోరబండ, బొల్లారం తదితర పోలీస్‌స్టేషన్లలో కొన్ని ఫిర్యాదులకు ఇదే సమాధానం ఎదురైనట్లుగా బాధితులు చెప్పారు. బాధితులు తమకు అన్యాయం జరిగిందంటూ..పీఎస్‌కి వెళ్తే వారి నుంచి వచ్చే సమాధానాలు చాలా ఇబ్బందికరంగా ఉంటున్నాయని, కొన్ని చోట్లనైతే వీటికే ఇంత దూరం రావాలా అంటూ పోలీసులంటున్నారని ఫిర్యాదుదారులే చెబుతున్నారు. ఫిర్యాదు రాగానే నాన్చుడు ధోరణి ప్రదర్శించకుండా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని స్పష్టంగా చెప్పామని పోలీస్ స్టేషన్ వేదికగా ఇరు వర్గాల మధ్య సెటిల్‌మెంట్ ప్రయత్నాలు చేస్తే చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పలుసార్లు చెప్పారు. కొందరు పోలీసులు తమ పద్ధతి మార్చుకోకుండా న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఫిర్యాదు రాగానే చట్ట ప్రకారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సింది పోయి అడ్డగోలు కారణాలతో కాలయాపన చేస్తున్నారు. గట్టిగా అడిగితే బాధితుల్నే దబాయిస్తున్నారు. భూ లావాదేవీల్లో కేసు నమోదుకు కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉంటుంది. మహిళలకు వేధింపులు, బెదిరింపులు, మోసాలు తదితర ఉదంతాల్లోనూ విపరీతమైన నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తమకెందుకొచ్చిన తంటా అంటూ..**

ఫిర్యాదుదారులు నేరుగానే కాకుండా ఈ–మెయిల్, ఎస్ఎంఎస్, వాట్సాప్, ఎక్స్.. ఇలా ఏ రూపంలో ఫిర్యాదు చేసినా ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించి వారిని విచారించి బాధితులకు న్యాయం చేసే దిశగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా చట్టంలో మార్పు వచ్చినా కొందరు ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు మాత్రం తమ పాత పద్ధతులను మార్చుకోవడం లేదు. ఇతర పద్ధతుల ద్వారా ఫిర్యాదు పక్కన పెడితే నేరుగా స్టేషన్‌కు వెళ్లినా కూడా స్పందన ఉండడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు వచ్చినప్పటి నుంచి పోలీసులపై ఒత్తిడి ఉంటోంది. ఫలితంగా ఈ పంచాయితీ తమకెందుకంటూ కేసుకు బదులు రాజీ ప్రయత్నాలే ఎక్కువగా జరుగుతున్నాయి. ఎఫ్‌ఐఆర్ నమోదైతే దానిపై విచారణ వేగవంతం చేయలేకపోతున్నామన్న విషయం ఒకటైతే పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువైతే తమ పై అధికారులతో క్రైం రివ్యూల్లో చీవాట్లు ఉంటాయన్న నెపంతో ముఖ్యమైన, కీలకమైన కేసులు తప్ప మిగతా ఫిర్యాదులపై పెద్దగా స్పందించడం లేదని సిటీలో ప్రముఖులు ఎక్కువగా ఉండే జోన్‌కు సంబంధించిన పోలీస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఘటన ఏదైనా సెటిల్‌మెంట్లకు స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు, స్థానిక నేతల జోక్యం పెరుగుతోందని.. తమకు పని తగ్గుతున్నదని ఆ అధికారి పేర్కొన్నారు.